సాక్షి
ఆదిలాబాద్

బుధవారం, 17, మే, 2023



లిక్కర్ కొరత 10లో▸

కొద్ది రోజులుగా వైన్స్‌ల్లో లిక్కర్ కొరత కనిపిస్తోంది. ధరల మార్పు నేపథ్యంలో వైన్స్‌లకు సరిపడా సరుకు సరఫరా చేయలేని పరిస్థితి.



నకిలీ విత్తనాలపై నిఘా

వానాకాలం సీజన్ సమీపిస్తుండడంతో వ్యవసాయశాఖ అధికారులు అప్రమత్తం అయ్యారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కొరడా ఝులిపించేందుకు నిఘా పెంచారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
42.0/29.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఎండతీవ్రత పెరగనుంది. వడగాలులు వీస్తాయి. ఉక్కపోత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

చిత్ర ప్రదర్శన నిలిపివేతపై బీజేపీ ఆందోళన



థియేటర్ ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్: బీఆర్ఎస్ నాయకులు బల ప్రదర్శనతో ది కేరళ స్టోరీ చిత్రాన్ని నిలిపివేయిస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి ఆరోపించారు. జిల్లాకేంద్రంలోని నటరాజ్ థియేటర్‌లో ప్రదర్శిస్తున్న ఈ చిత్రం మార్నింగ్ షోను మంగళవారం నిలిపివేయగా హిందూ సంఘాల నేతలు, బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. థియేటర్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. దేశవ్యాప్తంగా ప్రదర్శిస్తున్న సినిమాను సున్నితమైన ప్రాంతాలనే సాకుతో భైంసా, ఆదిలాబాద్‌లో నిలిపివేయడం సరికాదన్నారు. సినిమాను యథాతథంగా ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. అనంతరం మ్యాట్నీ షోలో చిత్రాన్ని పునః ప్రదర్శించడంతో నాయకులు చిత్రాన్ని వీక్షించారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, శరత్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

30న వాహనాలకు వేలం

ఆదిలాబాద్‌టౌన్: ఎక్సైజ్ శాఖలో పలు కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు ఈనెల 30న వేలం నిర్వహించనున్నట్లు ఆదిలాబాద్ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. ఎనిమిది ద్విచక్ర వాహనాలకు జిల్లా ఎక్సైజ్ అధికారి సమక్షంలో వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో పాల్గొనేవారు ఎంవీఐ నిర్దేశించిన ధరలో సగం ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల వారు ఆ రోజు ఉదయం 11గంటలకు ఆదిలాబాద్ ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో హాజరుకావాలని సూచించారు.

చదువుల పంటను సద్వినియోగం చేసుకోండి

ఆదిలాబాద్‌టౌన్: వేసవిలో విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటింటా చదువుల పంటను సద్వినియోగం చేసుకోవాలని డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. 3 నుంచి 9వ తరగతి విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మీడియంలో సైన్స్, గణితం, సాంఘిక శాస్త్రం సబ్జెక్టులకు సంబంధించి ప్రశ్నలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం జూన్ 10 వరకు కొనసాగుతుందని తెలిపారు. వివరాలకు వెబ్‌సైట్ https:// web. convegenius. ai లో సంప్రదించాలని సూచించారు.

‘మున్సిపల్‌లో పెరిగిన అవినీతి’



మాట్లాడుతున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్: ఆదిలాబాద్ మున్సిపాలిటీలో అవినీతి పెరిగిపోయిందని, ఈ విషయాన్ని ఆధారాలతో సహా బీజేపీ నాయకులు నిరూపిస్తే వైస్ చైర్మన్ బెదిరింపులకు పాల్పడుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. బల్దియాలో జరుగుతున్న అక్రమాలను బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి నిరూపించగా కార్యాలయంలోకి ఎలా వస్తావని మున్సిపల్ వైస్ చైర్మన్ భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. మున్సిపాలిటీ ఆయన జాగీరులా వ్యవహరిస్తున్నారని, ఎమ్మెల్యే జోగు రామన్న ఆయనకు రాసిచ్చారన్నట్లుగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ కార్యకర్తలు ఎవరికి భయపడరని ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో సైతం అవినీతి జరిగిందని, బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు రవి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్టీ కమిషన్ సభ్యుడి పర్యటన

కైలాస్‌నగర్: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంత్ నాయక్ బుధవారం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రకటనలో తెలిపారు. 16న రాత్రి 2.30 గంటలకు జిల్లా కేంద్రానికి చేరుకొని బస చేస్తారని పేర్కొన్నారు. 17న ఉదయం 9 గంటలకు జిల్లాకేంద్ర సమీపంలోని సీహెచ్‌సీతో పాటు ట్రైబల్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శిస్తారని తెలిపారు. 11.30 గంటలకు గిరిజన సంఘాలు,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 3గంటలకు జిల్లా అధికారులతో సమీక్ష ఉంటుందని వివరించారు.

నిప్పుల కుంపటి..

బీ కేర్ ఫుల్



జిల్లా కేంద్రంలో నిర్మానుష్యంగా ప్రధాన రహదారి

జిల్లాలో వారం రోజులుగా నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు(డిగ్రీ సెల్సియస్‌లో)

తేదీ	కనిష్టం	గరిష్టం
10వ	26.2	40.0
11వ	24.7	41.3
12వ	20.7	41.3
13వ	22.2	42.3
14వ	23.7	44.8
15వ	27.7	43.3
16వ	27.0	42.3



- పెరిగిపోతున్న గరిష్ట ఉష్ణోగ్రతలు
- జిల్లాలో 45 డిగ్రీలకు చేరువ
- జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్యనిపుణులు

ఆదిలాబాద్: జిల్లాలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి.. ఉదయం 10గంటలకే సూర్యప్రతాపం మొదలవుతోంది. మధ్యాహ్నం ఎండ తీవ్రతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ సమయంలో బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. వడ గాలులు సైతం తోడవడంతో రహదారులన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. భానుడి ప్రతాపం నుంచి తప్పించుకోవడానికి జనం శీతల పానియాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఎక్కువగా ఇంటి వద్దే కూలర్లు, ఏసీల వద్ద సేద తీరుతున్నారు. అత్యవసరంగా బయటకు వెళ్లే వారు రక్షణ కవచాలు ధరిస్తున్నారు.

హాఫ్ సెంచరీ దిశగా..

రోజురోజుకు ఎండ తీవ్రత పెరిగిపోతోంది. సాధారణంగా 40 డిగ్రీలు దాటితేనే బయటకు వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. అలాంటిది ప్రస్తుతం జిల్లాలో 45 డిగ్రీల వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పల్లె, పట్టణమనే తేడా లేకుండా వడ గాలులు వీస్తున్నాయి. రానున్న రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.



ఆదిలాబాద్ పట్టణంలోని బస్టాండ్ వద్ద ప్రధాన రహదారిపై మంగళవారం ఓ ఆటో మరమ్మతుకు గురైంది. అక్కడినుంచి కదలలేని పరిస్థితి. డ్రైవర్ ఓ మెకానిక్‌కు ఫోన్‌లో సమాచారం అందించగా ఆయన అక్కడికి వచ్చాడు. మిట్ట మధ్యాహ్నం.. నడినెత్తిన మండే ఎండలో ఇలా రిపేరింగ్ చేయాల్సిన పరిస్థితి. ప్రస్తుతం ఎండల తీవ్రత నేపథ్యంలో ఇలాంటి వారు వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఎక్కువ.



ఆటోపై గోనె సంచులు వేసి ప్రయాణికులను తరలిస్తున్న డ్రైవర్

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

గరిష్ట ఉష్ణోగ్రతలు పెరిగిన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఎండలో బయటకు వెళ్లే టప్పుడు ఈ జాగ్రత్తలు తప్పనిసరి పాటించాలి.

- పాదాచారులు గొడుగు, ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు కర్చీఫ్, టోపీ వంటివి ధరించాలి.
- తెలుపు రంగు కాటన్ దుస్తులు ఉత్తమం.
- ఉప్పు, మజ్జిగ, గ్లుకోజ్, కొబ్బరి నీటిని తరచూ తాగాలి.
- ఒకవేళ వడదెబ్బకు గురైతే తడిగుడ్డతో శరీరమంతా రుద్దాలని, శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థితికి వచ్చేలా చూడాలి.
- తల తిరగడం, అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే సమీపంలోని వైద్యుడిని సంప్రదించాలి.



వడదెబ్బకు గురికాకుండా చూసుకోవాలి



సాధారణంగా ఎండలో తిరిగే వారే వడదెబ్బకు గురవుతారని అనుకుంటారు. అయితే ఇంట్లో ఉన్నవారు సైతం దీని బారిన పడే అవకాశం ఉంటుంది. ఎండలో తిరిగే వారితో పాటు ఆ సమయంలో పనిచేసే కూలీలు వడదెబ్బకు గురైతే, వేడి గాలుల కారణంగా ఇంట్లో కూర్చున్న వారు డిహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంటుంది. వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ఇంట్లో చల్లని వాతావరణం ఉండేలా చూసుకోవాలి. వడగాలులు రాకుండా కిటికీలకు పర్దాలు వంటివి ఏర్పాటు చేసుకోవాలి. మద్యం, కూల్‌డ్రింక్‌కు దూరంగా ఉండాలి. కొబ్బరి బోండాలు, మజ్జిగ వంటివి ఎక్కువగా తీసుకోవాలి. సాధ్యమైనంత వరకు ఎండ సమయంలో కాకుండా సాయంత్రం వేళలో పనులు చేసుకునేలా చూడాలి. – డాక్టర్ సుమలత, జనరల్ ఫిజీషియన్

తరచూ నీళ్లు తాగాలి



ఎండల తీవ్రత దృష్ట్యా గర్భిణులు, బాలింతలు తరచూ నీటిని తాగాలి. దీంతో రక్తప్రసరణ సాధారణ స్థితిలో ఉంటుంది. ఉమ్మనీరు తగ్గకుండా ఉంటుంది. గర్భంలోని బిడ్డ సైతం ఆరోగ్యంగా ఉంటుంది. అప్పుడే పుట్టిన శిశువుకు బాలింతలు ఎక్కువగా పాలివ్వాలి. దీంతో పసికందులు డీహైడ్రేడ్ బారిన పడకుండా ఉంటారు. – క్షేత్రం జీవిత వెంకట్‌రెడ్డి, గైనకాలజిస్ట్

మూగజీవాలను చల్లని ప్రదేశంలో ఉంచాలి



మనుషులతో పాటు పశువులు సైతం వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఉంటాయి. సాధ్యమైనంత వరకు మూగజీవాలను చల్లని ప్రదేశంలో ఉండేలా చూడాలి. మేత కోసం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 తర్వాత తీసుకెళ్లడం ఉత్తమం. మధ్యాహ్నం వాటిని నీడలో ఉంచి ఎక్కువ మొత్తంలో నీరు తాగేలా చర్యలు చేపట్టాలి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే సమయంలో కుంటలు, చెరువుల్లో ఉంచాలి. దీంతో అవి డిహైడ్రేషన్‌కు గురికావు. స్ప్రింక్లర్లు అందుబాటులో ఉంటే కొట్టాలపై వాటిని వినియోగించాలి. అలాగే పక్షులు పెంచేవారు వాటి ఆవాసం చల్లని వాతావరణంలో ఉండేలా చూడాలి. తరచూ వాటికి నీటిని అందించాలి. – డాక్టర్ వి.సురేష్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, ఆదిలాబాద్

లక్ష్యం చేరుకోవాలంటే.. తప్పదు



విధి నిర్వహణలో భాగంగా ఇచ్చే టార్గెట్‌ను రీచ్ అవ్వాలంటే ప్రతిరోజు క్లయింట్ వద్దకు వెళ్లక తప్పదు. ప్రస్తుతం విద్యా సంస్థలకు సెలవులు ఉండడంతో టీచర్లు ఇంటి వద్దనే ఉంటారు. వారిని కలిసే క్రమంలో ఎండ తీవ్రత అధికంగా ఉన్నా తట్టుకోక తప్పడం లేదు. బైక్‌పై వెళ్లే సమయంలో వేడి గాలులు తగలకుండా కర్చీఫ్ కట్టుకుంటున్నా. – గాజిరి వెంకటేశ్, ఎల్ఐసీ ఏజెంట్, సుభాష్‌నగర్

ఎండవేడి బాగా పెరిగింది.



ప్రస్తుతం ఎండలు విపరీతంగా పెరిగాయి. మండుటెండల్లోనూ బయటకు వెళ్లాల్సి వస్తోంది. ఉద్యోగ రీత్యా తప్పడం లేదు. ఎండ నుంచి రక్షణగా టోపీతో పాటు కర్చీఫ్ కట్టుకుంటున్నాను. అయినా వేడిమి తట్టుకోలేని పరిస్థితి. – మొబిన్‌ఖాన్, బొక్కల్‌గూడ, ప్రైవేట్ ఉద్యోగి

వడగాలులతో సతమతం..



విధి నిర్వహణలో భాగంగా ప్రతిరోజు బస్సులో వెళ్లాల్సి వస్తుంది. ఎండలు దంచి కొడుతుండడంతో వడి గాలులతో సమతతం అవుతున్నాం. బయట ఉన్నదాని కంటే బస్సులో ఉష్ణోగ్రత తీవ్రత అధికంగా ఉంటుంది. బస్టాండ్ నుంచి ప్రయాణికులతో బస్సు బయల్దేరిన తర్వాత గమ్యస్థానానికి చేరుకునే వరకు తాగునీరు సైతం దొరకని పరిస్థితి. దాహం వేస్తే హోటళ్ల వద్ద ఆగి నీటిని తాగుతున్నాం. – విజయ్‌కుమార్, ఆర్టీసీ కండక్టర్, బోథ్



ముఖానికి స్కార్ఫ్ ధరించి వాహనంపై వెళ్తూ..

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ రిజ్వాన్, ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

- అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

కైలాస్‌నగర్: జిల్లాలో నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఈమేరకు వ్యవసాయ, పోలీస్‌శాఖల సమన్వయంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, వ్యవసాయ శాఖ అధికారులతో వానాకాలం సీజన్ ముందస్తు ఏర్పాట్లపై మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. నాణ్యమైన ఎరువులు, విత్తనాలు సమయానికి అందించడంతో పాటు పంట దిగుబడి అధికంగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వానాకాలం సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువుల నిల్వలను ఉంచుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలు మార్కెట్‌లో రాకుండా పూర్తిగా అరికట్టాలన్నారు. క్షేత్ర స్థాయిలో సమాచారం సేకరించి పక్క రాష్ట్రాల నుంచి వచ్చే నకిలీ విత్తనాలు, ఎరువులను నియంత్రించాలన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్ట్ ఏర్పాటు చేసి నిఘా పెంచాలని సూచించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో నకిలీ విత్తనాలు అరికట్టేందుకు వ్యవసాయ, పోలీస్ శాఖల సమన్వయంతో టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ఇవి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఇందులో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్, ట్రెయినీ కలెక్టర్ శ్రీజ, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నివారణకు అందరూ కృషి చేయాలి


ఆదిలాబాద్‌టౌన్: డెంగీ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. పట్టణంలోని కేఆర్‌కే కాలనీలో గల బస్తీ దవాఖానాలో మంగళవారం నిర్వహించిన జాతీయ డెంగీ దినోత్సవానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రెండేళ్లుగా జిల్లాలో డెంగీ కేసులు గణనీయంగా తగ్గాయని, పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమం కింద చేపట్టిన పారిశుధ్య కార్యక్రమాలే దీనికి ప్రధాన కారణమని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవన్నారు. వారంలో రెండు రోజులు డ్రైడేగా పాటించాలని, దోమలు వృద్ధి చెందకుండా నిల్వ నీటిని తొలగించాలన్నారు. అంతకు ముందు వ్యాధుల నియంత్రణ, పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు, మెప్మా ఆర్పీ, మున్సిపల్ సిబ్బందికి ప్రశంస పత్రాలు అందించారు. అనంతరం కాలనీలో పర్యటిస్తూ నిల్వ ఉన్న నీటిని పారబోసేలా చూశారు. మురుగు కాల్వల్లో బ్లీచింగ్ చేయించారు. తెలంగాణ సాంస్కృతిక మండలి కళాకారులు పాటల రూపంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, జిల్లా మలేరియా అధికారి శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ శైలజ, స్థానిక కౌన్సిలర్ అంజు తదితరులు పాల్గొన్నారు.



నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న అదనపు కలెక్టర్

గాడి తప్పిన పాలన

- బల్దియాలో అడుగడుగునా అక్రమాలే..!
- ద్వితీయ స్థాయి నాయకుడి పెత్తనం
- హడలిపోతున్న అధికారులు, జనం
- లోపించిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- ఆదిలాబాద్ మున్సిపల్ తీరిది



మున్సిపల్ కార్యాలయం

కైలాస్‌నగర్: గ్రేడ్–1 స్థాయి కలిగిన ఆదిలాబాద్ మున్సిపాలిటీలో పాలన గాడి తప్పింది. అడుగడుగునా అవినీతి, అక్రమాలే దర్శనమిస్తున్నాయి. వీటికి తోడు బల్దియా ద్వితీయస్థాయి నాయకుడి పెత్తనం రోజురోజుకు హెచ్చుమీరుతుందనే విమర్శలున్నాయి. పాలనా వ్యవహారాల్లో జోక్యంతో పాటు అధికారులు, ఉద్యోగులపై దబాయింపు వైఖరి ఆయన తీరుకు నిదర్శనంగా నిలుస్తోంది. తన మాట వింటే సరే.. లేదంటే రాజకీయంగా పైనుంచి ఒత్తిళ్లు తెచ్చి ఉద్యోగుల సెక్షన్లను సైతం మార్చేలా వ్యవహరిస్తున్నాడు. తాజాగా కార్యాలయానికి వచ్చిన సామాన్యులపై సైతం తన జులుం ప్రదర్శించి బెదిరింపులకు దిగడం విమర్శలకు తావిస్తోంది. పట్టణాభివృద్ధితో పాటు ప్రజలకు అందుతున్న సేవలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు బల్దియా వైపు కన్నెత్తి చూడటం లేదు. దీన్ని సదరు నాయకుడు తనకు అనుకూలంగా మలచుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడు.

ద్వితీయ స్థాయి పెత్తనం

బల్దియాలో ద్వితీయ స్థాయి నాయకుడి పెత్తనం హద్దుమీరుతోంది. ఇక్కడ అంతా తనదే అన్నట్లుగా వ్యవహరిస్తుండటం తోటి కౌన్సిలర్లకు సైతం మింగుడు పడటం లేదు. సదరు నాయకుడి తీరుపై ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదులు అందిన ఆ నాయకుడి తీరులో మాత్రం మార్పు రాకపోవడం గమనార్హం. భూ కబ్జాలకు పాల్పడటం..అక్రమంగా పత్రాలు పొందడం.. బల్దియా సిబ్బందితో వాగ్వాదానికి దిగడం.. బినామీల పేరిట అసెస్‌మెంట్లు చేయడం వంటివి ఆయనకు మామూలే. పట్టణంలో చిరు వ్యాపారుల కోసం నిర్మించిన దుకాణ సముదాయాలను తాను చెప్పిన వారికి కేటాయించడంతో పాటు వారి నుంచి భారీగానే వసూళ్లకు పాల్పడినట్లుగా ఆరోపణలున్నాయి. ఇటీవల పట్టణంలోని డైట్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఎగ్జిబిషన్ ఏర్పాటులోనూ తానే ముందుండి సంబంధిత శాఖల నుంచి అనుమతులు, ఎన్‌వోసీలు జారీ చేయించారని అప్పట్లో అధికార పార్టీ కౌన్సిలర్లే కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయడం సదరు నాయకుడి తీరుకు అద్దం పడుతుంది.

అస్తవ్యస్తంగా పాలన..

అక్రమ లేఅవుట్లు, కట్టడాలు, భూకబ్జాలను నియంత్రించాల్సిన పట్టణ ప్రణాళిక విభాగం ప్రేక్షకపాత్రకే పరిమితమైంది. దిగువస్థాయి అధికారే ఈ విభాగానికి పెద్ద దిక్కుగా మారి అన్ని తానై ‘వ్యవహారం’ నడిపిస్తున్నాడు. ఫిర్యాదు అందిన వెంటనే క్షేత్రస్థాయికి వెళ్లి అందినకాడికి దండుకుంటున్నాడే తప్ప సమస్యపై చర్యలు చేపట్టడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. బల్దియాలో అత్యంత కీలకమైన రెవెన్యూ విభాగంలోనూ ఇదే తంతు. ద్వితీయ స్థాయి నాయకుడితో పాటు పలువురు కౌన్సిలర్లు, నాయకులు అధికారులపై ఒత్తిడి తెచ్చి దొడ్డిదారిన అక్రమంగా అసెస్‌మెంట్లు చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. మ్యూటేషన్లలోనూ చేతి వాటం ప్రదర్శిస్తున్నారు. ఆర్జేడీ స్థాయి అధికారి విచారణ చేపట్టడమే ఇందుకు నిదర్శనం. ఇక ఇంజినీరింగ్ సెక్షన్ గురించి ఎంత చెప్పినా తక్కువే. దీర్ఘకాలంగా పాతుకుపోయిన ఓ అధికారి ఈ విభాగానికి కింగ్‌లా వ్యవహరిస్తున్నాడు. తన పైస్థాయి అధికారి ఉన్నా తాను చెప్పిందే వేదం అన్నట్లుగా పనులు చేస్తున్నాడు. ఏకంగా బినామీ పేరిట కాంట్రాక్టర్ అవతారమెత్తి పనులు చేపడుతుండటం ఆయన తీరుకు అద్దం పడుతుంది. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే మరో కీలకమైన పారిశుధ్య విభాగంలోనూ అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయనే విమర్శలున్నాయి. ట్రేడ్ లైసెన్స్‌ల జారీలో కొంతమంది సిబ్బందికి ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలున్నాయి. పట్టణంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లను పర్యవేక్షించాల్సిన ఈ విభాగం అధికారులు ఇప్పటివరకు అటువైపు చూడటం లేదు. ఈ విభాగాలన్నింటినీ సమన్వయం చేసుకుని పాలనను సక్రమంగా నడిపించాల్సిన బల్దియా ఉన్నతాధికారి సైతం పట్టించుకోవడం లేదు. ఈ ప్రభావం మున్సిపల్ వ్యవహారాలు, పాలనపై పడుతుంది. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్‌లోనూ బల్దియా వ్యవహారాలపై అనేక ఫిర్యాదులు అందుతుండటం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.

లోపించిన పర్యవేక్షణ ..

నూతన మున్సిపల్ చట్టం ప్రకారం కలెక్టర్‌కు ప్రత్యేకాధికారాలు కల్పించడంతో పాటు, స్థానిక సంస్థల వ్యవహారాల పర్యవేక్షణకు అడిషనల్ కలెక్టర్‌ను ప్రత్యేకంగా ప్రభుత్వం నియమించింది. ఇద్దరు ఉన్నతాధికారులు ఉన్నా మున్సిపల్ పాలన తీరు మాత్రం మారడం లేదు. పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులతో పాటు ప్రజలకు అందుతున్న సేవలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పాలనను గాడిలో పెట్టాల్సిన సదరు అధికారులు ఆ దిశగా దృష్టి సారించడం లేదనే విమర్శలున్నాయి. కేవలం మొక్కుబడి సమీక్షలకు పరిమితమవుతున్నారే తప్ప క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందనే దానిపై ఆరా తీయడం లేదని తెలుస్తోంది. దీన్ని అదునుగా తీసుకున్న మున్సిపల్ అధికారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇదే క్రమంలో రాజకీయ జోక్యం హెచ్చుమీరి అనేక అవినీతి, అక్రమాలు చోటు చేసుకుంటున్నాయనే ఆరోపణలున్నాయి.

రెగ్యులర్‌గా పర్యవేక్షిస్తున్నాం

మున్సిపల్ పాలన, అభివృద్ధి పనులపై రెగ్యులర్‌గా సమీక్షిస్తున్నాం. బల్దియాలో అవినీతి, అక్రమాలు జరిగినట్లు ఇప్పటి వరకు మా దృష్టికి రాలేదు. ఫిర్యాదు అందితే మాత్రం బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. ఇక నుంచి రెగ్యులర్‌గా మున్సిపల్‌ను సందర్శించి పనితీరు మరింత మెరుగు పర్చేలా చర్యలు తీసుకుంటాం. – రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్

నకిలీ విత్తనాలపై నిఘా

ఆదిలాబాద్‌టౌన్: వానాకాలం సీజన్ సమీపిస్తుండడంతో వ్యవసాయశాఖ అధికారులు అప్రమత్తం అయ్యారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కొరడా ఝుళిపించేందుకు నిఘా సారించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా వ్యవసాయ అధికారి కన్వీనర్‌గా, డీఎస్పీ, ఏడీఏలు సభ్యులుగా ఉంటారు. మండల స్థాయిలో మండల వ్యవసాయ అధికారి, తహసీల్దార్, ఎస్సైలు టాస్క్‌ఫోర్స్ కమిటీలో సభ్యులుగా ఉంటారు. బుధవారం నుంచి జిల్లాలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు తనిఖీలు చేపట్టనున్నారు. మంగళవారం కమిటీలను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.

- జిల్లా, మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీల ఏర్పాటు
- నేటి నుంచి తనిఖీలు
- నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట పడేలా..



విత్తన దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

నేటి నుంచి తనిఖీలు

నకిలీ విత్తనాలపై నిఘా పెట్టేందుకు టాస్క్‌ఫోర్స్ కమిటీ బుధవారం నుంచి జిల్లాలోని అన్ని మండలాల్లో తనిఖీలు చేపట్టనుంది. విత్తనాలు, ఎరువుల గోదాములు, దుకాణాలు, అనుమానం ఉన్న షాపుల్లో తనిఖీలు చేయనున్నారు. అదేవిధంగా గ్రామాల్లో కూడా అధికారులు తనిఖీలు చేపట్టి రైతులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జిల్లాలో దాదాపు 500 విత్తన, ఎరువుల దుకాణాలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా లైసెన్సులు లేకుండా విక్రయిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. లైసెన్సులు ఉన్న దుకాణదారులు నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరిపితే వారిపై కూడా చర్యలు చేపట్టనున్నారు. జిల్లాకు 8 లక్షల 50 వేల పత్తి ప్యాకెట్లు, 40 వేల క్వింటాళ్ల సోయా విత్తనాలు అవసరం ఉన్నాయి. అయితే రైతుల అవసరాలను ఆసరాగా చేసుకొని కొంతమంది డీలర్లు రైతులను ప్రతిఏటా మోసం చేస్తూనే ఉన్నారు.

అడ్డుకట్ట పడేనా..

కొంతమంది డీలర్లు గ్రామాల్లో తిరుగుతూ రైతుల వద్ద ముందుగానే పత్తి విత్తనాలు బుకింగ్ చేసుకుంటున్నారు. లక్కీ కూపన్ల పేరిట వారిని మోసం చేస్తున్నారు. ప్రతిఏడాది ఈ వ్యాపారం చాపకింద నీరులా విస్తరిస్తున్నప్పటికీ వ్యవసాయ శాఖ అధికారులు అరికట్టడంలో విఫలమవుతున్నారు. గతేడాది తలమడుగు, జైనథ్, తాంసి తదితర మండలాల రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేసిన విత్తనాలు మొలకెత్తకపోవడంతో డీలర్ షాపుల ఎదుట ఆందోళన చేపట్టారు. అయినప్పటికీ ఆ డీలర్లపై చర్యలు చేపట్టలేకపోయారు. గత కొన్నేళ్లుగా ఇదే తంతు జరుగుతున్నప్పటికీ ఈ నకిలీ విత్తనాల మోసగాళ్ల ఆటకట్టడంలో వ్యవసాయ అధికారులు సఫలీకృతం కావడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. టాస్క్‌ఫోర్స్ కమిటీలు ప్రతిఏటా ఏర్పాటు చేస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో నకిలీ విత్తనాలను గుర్తించడం లేదనే అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది. ఆంధ్ర, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన కొంతమంది డీలర్లు జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ముందుగానే బుకింగ్ చేసుకొని రైతులకు నాసిరకమైన విత్తనాలు అంటగడుతున్నారు. మోసపోయాక రైతులు లబోదిబోమంటున్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు



నకిలీ విత్తనాలను అరికట్టేందుకు టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశాం. జిల్లా స్థాయి కమిటీలో డీఎస్పీ, ఏడీఏలు, మండల స్థాయి కమిటీలో మండల వ్యవసాయ అధికారి, తహసీల్దార్, ఎస్సైలు సభ్యులుగా ఉన్నారు. బుధవారం నుంచి జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేపడుతాం. రైతులు డీలర్ల వద్దనే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలి. రసీదు తప్పనిసరిగా తీసుకోవాలి. నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

– పుల్లయ్య, జిల్లా వ్యవసాయ అధికారి, ఆదిలాబాద్

క్లుప్తంగా

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య



సాయన్న (ఫైల్)

లక్ష్మణచాంద: అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వడ్యాల్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై రాహుల్ గైక్వాడ్ కథనం ప్రకారం.. వడ్యాల్ గ్రామానికి చెందిన రావులబండి సాయన్న(54), లక్ష్మి భార్యభర్తలు. ఇద్దరు కుమారులు గణేశ్(18), మహేశ్ (14) ఉన్నారు. సాయన్న వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. భార్య లక్ష్మి కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతుండేది. ఆ సమయంలో లక్ష్మి వైద్య చికిత్స నిమిత్తం సాయన్న అప్పులు చేశారు. ఐదేళ్ల క్రితం లక్ష్మి చనిపోయింది. చేసిన అప్పులు తీర్చలేక తీవ్ర మనస్తాపంతో సాయన్న సోమవారం ఇంట్లోనే గుర్తు తెలియని పురుగుల మందు తాగి పడిపోయాడు. అటువైపు వెళ్లిన వారు గమనించి నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మంగళవారం వేకువజామున మృతిచెందాడు. మృతుడి తల్లి చిన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తితో యువకుడు...

కుభీర్: జీవితంపై విరక్తితో యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఎండీ.షరీఫ్ కథనం ప్రకారం.. మండలంలోని దార్‌కుభీర్ గ్రామానికి చెందిన బన్సోడే శ్రీకాంత్ (25) ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం మద్యం మత్తులో గేదెలు మేపడానికి వెళ్తానని చెప్పి తన పశువుల పాకకు వెళ్లి తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీకాంత్ చిన్నాన్న గంగాధర్.. పనిమీద పాకకు వెళ్లి చూసి కుటుంబీకులకు సమాచారం ఇచ్చాడు. మృతుడి తండ్రి ఈర్వా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

25 మందికి జరిమానా

నిర్మల్‌టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 25 మందికి జరిమానా, ఒకరికి మూడు రోజుల జైలుశిక్ష విధిస్తూ నిర్మల్ కోర్టు స్పెషల్ జ్యుడిషియల్ జడ్జి తీర్పునిచ్చారని పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం మత్తులో వాహనం నడుపుతూ పలువురు పట్టుబడగా వారిని కోర్టులో హాజరుపర్చారు. 25 మందికి రూ.22,800 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారు.

బైక్ ఢీకొని ఒకరి మృతి



సంతోష్ (ఫైల్)

బోథ్: మండలంలోని సొనాల గ్రామ సమీపంలో బైక్ ఢీకొని ఒకరు మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. సొనాలకు చెందిన బాలె సంతోష్ ఫర్టిలైజర్ షాపు నిర్వహిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం ఘన్‌పూర్ వైపు వాకింగ్ చేస్తున్న సంతోష్‌ను సొనాల శివారులో మహారాష్ట్ర వైపు వెళ్తున్న బైక్ వెనుక నుంచి ఢీకొంది. దీంతో తీవ్ర రక్తస్రావమై సంతోష్ అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్‌పై ఉన్న ఇద్దరిలో ఒకరు తీవ్ర గాయాలపాలై బోథ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మరొకరు పారిపోయినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పెళ్లి వేడుకలో తప్పిన ప్రమాదం



దగ్ధమైన బైక్, టెంట్

భైంసాటౌన్: బాసర మండలకేంద్రంలో మంగళవారం ఓ వివాహ వేడుకలో హఠాత్తుగా స్వల్ప అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానిక సరస్వతి కల్యాణ మండపంలో జరిగిన పెళ్లి వేడుకలో ఈ ప్రమాదం జరుగగా, ఎవరికి ఎలాంటి హాని కలుగలేదు. వివరాల్లోకి వెళ్తే.. కల్యాణ మండపంలో వివాహ అనంతరం వేడుకల్లో భాగంగా టపాకాయలు కాల్చడంతో నిప్పురవ్వలు ఎగిరి టెంట్‌పై పడడంతో మంటలు చెలరేగాయి. దీంతో టెంట్ కింద ఉన్న నాలుగు బైక్‌లు, కుర్చీలు దగ్ధమయ్యాయి. అక్కడున్నవారు మంటలార్పడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్: తలమడుగు మండలం ఉండంకు చెందిన రేంజర్ల సంటెన్న (60) హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఈనెల 13న సాయంత్రం 4 గంటల సమయంలో ఆదిలాబాద్‌లోని గాంధీనగర్ నుంచి ఇందిరానగర్ వైపు వెళ్తున్న క్రమంలో ఎద్దు పొడవడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి రిమ్స్‌కు తరలించారు. అక్కడి నుంచి మరుసటి రోజు హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో ఆయన మనుమడు రేంజర్ల మురళి ఫిర్యాదు మేరకు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

అక్రమంగా తరలిస్తున్న ఆవుల పట్టివేత



వాహనంలో ఆవులు

ఖానాపూర్: మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామం మీదుగా కడెం వైపు బొలెరోలో అక్రమంగా ఆవులను తరలిస్తున్న వాహనాన్ని మంగళవారం ఉదయం పట్టుకున్నట్లు ఎస్సై ఆర్.శంకర్ తెలిపారు. అనుమానాస్పదంగా వెళ్తున్న వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో 9 ఆవులతో పాటు ఒక లేగదూడ ఉందని పేర్కొన్నారు. ఆవులకు సంబంధించి ఎలాంటి రసీదు, అనుమతిపత్రం లేదని, ఓవర్‌లోడ్ ఉండడం వల్ల డ్రైవర్ ఇమ్రాన్, యజమాని బారిక్ రుషిపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై తెలిపారు. పట్టుకున్న ఆవులను గోశాలకు తరలించినట్లు పేర్కొన్నారు.

దొంగతనం కేసులో ఇద్దరికి జైలు

నిర్మల్‌టౌన్: దొంగతనం కేసులో ఇద్దరికి మూడు నెలల జైలుశిక్ష విధిస్తూ నిర్మల్ ప్రథమ న్యాయమూర్తి ఆర్.అజయ్‌కుమార్ మంగళవారం తీర్పునిచ్చారు. కోర్టు సమన్వయల అధికారి సక్రియనాయక్ తెలిపిన వివరాలు.. జిల్లాకేంద్రానికి చెందిన గన్నేరు ప్రభు ఇత్తడి వ్యాపారం చేసుకునేవాడు. వ్యాపార రీత్యా ఇత్తడి పాత సామన్లు 200 కేజీల వస్తువులను తన పాత ఇంట్లో భద్రపర్చాడు. 2022 నవంబర్ 10న రాత్రి సమయంలో నేరస్తులైన మోతే సాయి, గోగ్గుల గంగనగేశ్, పిట్ల అంజి కలిసి ప్రభు ఇంట్లో చొరబడి రూ.50 వేల విలువైన 200 కిలోల ఇత్తడి సామాన్లను ఎత్తుకెళ్లారు. బాధితుడు ఫిర్యాదు తో ఎస్సై రమణారెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. చార్జీషీట్ దాఖలు చేసి కోర్టులో నిందితులను హాజరుపర్చారు. పీపీ సీహెచ్ సతీశ్ 6 మంది సాక్షులను ప్రవేశపెట్టి కోర్టులో నేరం రుజువు చేయడంతో న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కాగా, మూడో నేరస్తుడైన పిట్ల అంజి చనిపోయాడు.

మొక్కజొన్న దగ్ధం



కాలిన మొక్కజొన్నను చూపిస్తున్న బాధిత రైతు

కుంటాల: మండలంలోని అంబకంటి శివారులో మంగళవారం అగ్ని ప్రమాదంలో మొక్కజొన్న పంట దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన రైతు శీల సునీల్ యాసంగి సీజన్‌లో తనకున్న రెండెకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. హార్వెస్టర్‌తో పంట నూర్పిడి చేసేందుకు కుప్పలు కుప్పలుగా పోసి ఉంచాడు. కాగా పంట చేను పైన ఉన్న విద్యుత్ వైర్లు గాలికి ఒకదానికొకటి తగలి నిప్పురవ్వలు ఎగిసిపడడంతో మొక్కజొన్న పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ.లక్షా 70వేల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు.

ఇండో–నేపాల్ క్రికెట్ చాంపియన్ షిప్‌నకు దీపురెడ్డి



దీపురెడ్డి

లోకేశ్వరం: మండల కేంద్రానికి చెందిన కొమ్ముల దీపురెడ్డి ఇండో–నేపాల్ క్రికెట్ చాంపియన్ షిప్‌నకు ఎంపికయ్యాడు. గతేడాది అక్టోబర్‌లో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఇందులో అండర్–14లో తెలంగాణ టీం నుంచి దీపురెడ్డి ప్రతిభ కనబర్చాడు. నేపాల్ దేశంలో పోక్రాలో ఈనెల 14 నుంచి 18 వరకు నిర్వహించే క్రికెట్ ఇండో–నేపాల్ చాంపియన్ షిప్–2023కు దీపురెడ్డిని ఎంపిక చేశారు. దీంతో తల్లిదండ్రులు కొమ్ముల కల్యాణ్‌రెడ్డి–శారద, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'ఉపాధి'లో అక్రమాలు

- గల్ఫ్ దేశాల్లో ఉన్నవారు పని చేసినట్లు నిధులు స్వాహా
- హరితహారం, ప్రకృతివనాల్లో వేల సంఖ్యలో ఎండిన మొక్కలు



పాల్గొన్న డీఆర్‌డీవో విజయలక్ష్మి, అధికారులు

సారంగపూర్: ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో పలు అక్రమాలు వెలుగు చూశాయి. చాలావరకు హాజరు నమోదు, తమ బంధువుల పేర్లమీద గల్ఫ్ దేశాలకు వలస వెళిన వారి పేరుమీద పనిచేసినట్లుగా మస్టర్లపై స్వదేశంలో లేనివారి సంతకాలు చేసి ఖాతాల్లో డబ్బులు జమచేసుకున్నవారి వివరాలు బట్టబయలయ్యాయి. మండలంలోని అడెల్లికి చెందిన యాటకారి పీరాజీ దుబాయికి ఉపాధి నిమిత్తం వెళ్లాడు. తన పేరు మీద పనిచేసినట్లు అక్రమ మస్టర్లు సృష్టించి రెండువారాల పాటు పనిచేశారని రూ.1167ల నిధులను పక్కదారి పట్టించారు. వివిధ గ్రామాల్లో ఇదే తరహాలో దాదాపు రూ. 55వేల నిధులు అక్రమాలు జరిగినట్లు బృందాలు వెల్లడించాయి. బీరవెల్లికి చెందిన ఉపాధి పనుల రిజిష్టర్లు అప్పగించలేదని తనిఖీ బృందాలు సభలో ప్రస్తావించారు. అడవిలో గుడిసెకు నిప్పంటుకోవడంతో రిజిష్టర్లు కాలాయన్నారు. వారి తరఫున పలువురు మాట్లాడుతూ వర్షానికి తడిసిపోయాయని సమాధానమివ్వడం అనుమానాలకు తావిస్తోంది. మండల వ్యాప్తంగా 2019 డిసెంబర్ 1నుంచి 31మార్చి 2023 వరకు రూ.35 కోట్ల 30 లక్షల నిధులతో 32 పంచాయతీల్లో పనులు చేపట్టారు. హరితహారంలో భాగంగా గ్రామాల్లో పల్లె ప్రకృతివనాలు, గ్రీన్‌జోన్‌లు, శ్మశానవాటికలు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటారు. లక్షల్లో నాటిన మొక్కలు వేలలో మాత్రమే వృద్ధిచెందగా ఇదేంటని పలుమార్లు డీఆర్‌డీవో విజయలక్ష్మి గ్రామాల ఎఫ్‌ఏలు, కార్యదర్శులు, టీఏలను ప్రశ్నించారు. ఇక పెంపకందారులకు గొర్రెలు, ఆవులు, మేకలకు మంజూరైన షెడ్లను అధికారులు, నాయకుల అండదండలతో రాయితీ నిధులతో నివాస గృహాలుగా మార్చుకున్నారని తనిఖీల్లో వెల్లడయ్యాయి. కంపోస్టు పిట్లు, ఇంకుడు గుంతల నిర్మాణాలు, బినామీ పేర్లతో బిల్లులు, ఇలా అనేక అక్రమాలు వెలుగు చూశాయి. ఏపీవో లక్ష్మారెడ్డి, ఎస్ఆర్‌పీ రాఘవులు, ఎస్‌టీఎం దత్తు, డీఆర్‌పీ కవిత పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని రవీంద్రనగర్‌లో గల ఉమామహేశ్వర్, అయ్యప్ప ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. దీంతో ఆలయ నిర్వాహకుడు కోల వేణుగోపాల్‌రెడ్డి వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై అశోక్, హెడ్ కానిస్టేబుల్ రాములు మంగళవారం దొంగను పట్టుకున్నారు. ఈయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లాకు చెందిన గండికోట దుర్గాప్రసాద్ గతకొన్ని రోజులుగా ఆదిలాబాద్‌లోని వడ్డెర కాలనీలో నివాసం ఉంటున్నాడు. తరచూ ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడుతూ తప్పించుకొని తిరుగుతున్నాడు. ఈయనపై పలు పోలీసుస్టేషన్‌లో 14 కేసులు నమోదయ్యాయి. నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

అదుపుతప్పిన బైక్

- ముగ్గురికి తీవ్రగాయాలు

తాంసి: మండల కేంద్రంలోని సుంకిడి గ్రామ సమీపంలో బైక్ అదుపుతప్పిన ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. తాంసి గ్రామానికి చెందిన కోట్రంగి పాండ్, సంతోష్ మద్యం మత్తులో సోమవారం రాత్రి సుంకిడి నుంచి తాంసి గ్రామం వైపు బైక్‌పై వస్తున్నారు. ఈ క్రమంలో గ్రామ సమీపంలో రాగానే బైక్ ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న కాడిగిరి సంతోష్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న సంతోష్, పాండ్‌లకు తీవ్ర గాయాలు కాగా, రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న సంతోష్ కాలుపై బైక్ వెళ్లడంతో కాలు విరిగింది. గాయపడిన వారిని గ్రామస్తులు అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ



తీవ్రంగా గాయపడిన నర్సయ్య

సిరికొండ: మండలంలోని సుంకిడి గ్రామంలో మంగళవారం సాయంత్రం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. సిరికొండలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో పని ముగించుకొని మేనేజర్ నరేశ్, సిబ్బంది నర్సయ్య ఇచ్చోడకు బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో ఇచ్చోడ నుంచి సిరికొండకు గోర్ల శంకర్ బైక్‌పై వస్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈప్రమాదంలో నరేశ్, నర్సయ్య, గోర్ల శంకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.

నిర్మల్‌లో జీరోషాడో



వస్తువు నీడను కోల్పోయిన దృశ్యాన్ని వీక్షిస్తున్న చిన్నారులు

- నిమిషం 40 సెకన్లు కనిపించని నీడ
- వస్తువుతో పరీక్షించిన చిన్నారులు

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్‌లో మంగళవారం ఓ అద్భుతం ఆవిష్కృతమైంది. నిమిషం 40 సెకన్ల పాటు నీడ మాయమైంది. మధ్యాహ్నం 12.12 నుంచి 12.13 నిమిషాల 40 సెకన్ల పాటు మనుషులు, వస్తువుల నీడ కనిపించలేదు. ఒక వస్తువుపై సూర్యకిరణాలు పడితే మరోవైపున వ్యతిరేక దిశలో ఆ వస్తువు నీడ ఏర్పడటం సర్వసాధారణమే. దీనికి భిన్నంగా ఉష్ణమండలంలోని కర్కాటక రేఖ, మకరరేఖ 23.4 డిగ్రీల మధ్యన నీడలేని రోజు (జీరో షాడో డే) సంవత్సరానికి రెండుసార్లు ఏర్పడుతుంది. ఈ ఏడాది నిర్మల్ జిల్లాకేంద్రంలో నీడలేని రోజు మే 16న కనిపించింది. ఇదే ఘటన తిరిగి జూలై 27న మరోసారి పునరావృతం కానుంది. నిర్మల్‌లో నీడ మాయం కావడంతో పలువురు చిన్నారులు పొడువాటి వస్తువుతో పరీక్షించారు.

భూమి అక్షం సూర్యునితో గల కోణంలో వంపు కారణంగా నీడ సంభవిస్తుంది. ఏడాది పొడవునా సూర్యకిరణాలు ప్రసారమయ్యే కోణాన్ని బట్టి వాటి నీడల పొడవు, దిశ మారుతుంటుంది. భూభ్రమణం అక్షం సమతలానికి 23.45 డిగ్రీల కోణంలో వంగి ఉంటుంది. భూమి సూర్యుని మధ్యరేఖను సౌరక్షీణత అని పిలుస్తారు. ఈ సౌరక్షీణత సూర్యకిరణాలు పడే అక్షాంశానికి సమానమైనప్పుడు 'జీరో షాడో డే' ఏర్పడుతుందని జిల్లాకేంద్రానికి చెందిన భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు పురస్తు శ్రీనివాస్ 'సాక్షి'తో పేర్కొన్నారు. ఈ ప్రక్రియ ఏడాదిలో రెండుసార్లు కనిపిస్తుందన్నారు.

డిగ్రీ కళాశాలకు రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతి



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలకు జిజ్ఞాస పోటీల్లో రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతి లభించింది. కళాశాల విద్యార్థులు రూపొందించిన బుర్నూర్ గ్రామ సమగ్ర చరిత్రకుగాను ఈ అవార్డు దక్కింది. మంగళవారం హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఆడిటోరియంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి చేతుల మీదుగా విద్యార్థులు అవార్డును అందుకున్నారు. రూ.21వేల నగదుతోపాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ప్రిన్సిపాల్ జగ్‌రాం, జిజ్ఞాస సమన్వయకర్త రమేశ్, గైడ్ టీచర్ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



ఆత్రం రంబాబాయి(ఫైల్)

ఇంద్రవెల్లి: మహిళ అదృశ్యమైన ఘటన మండలంలోని గట్టెపల్లి పంచాయతీ పరిధిలోని చిత్తగూడలో చోటుచేసుకుంది. ఎస్సై సునీల్ కథనం ప్రకారం.. చిత్తగూడకు చెందిన ఆత్రం రంబాబాయి (27) ఈనెల 5న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకలేదు. రంబాబాయి అన్న ఆత్రం జంగు మంగళవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్/ఉట్నూర్‌రూరల్: అట్రాసిటీ కేసుల్లో బాధితులకు ప్రభుత్వం తరఫున ఆర్థికంగా, పునరావాసం కల్పించేందుకు డివిజనల్ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుల ఎంపికకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏఎస్‌వో నారాయణ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన కార్యకర్తలు, సంఘాల, స్వచ్ఛంద సంస్థల సభ్యులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆదిలాబాద్, ఉట్నూర్ డివిజనల్ కమిటీలకు సంబంధించి ఆదిలాబాద్, ఉట్నూర్ ఏఎస్‌డబ్ల్యూవో కార్యాలయాల్లో ఈనెల 22లోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. కుల, నివాస ధ్రువీకరణ పత్రాలతోపాటు ఆధార్, రెండు పాస్‌ఫొటోలు, సామాజిక కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు పొందుపర్చి దరఖాస్తుకు జత చేయాలన్నారు.

వానరం దాహం తీర్చిన పోలీస్



నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని రాష్ట్రమంత్రి ఇంద్రకరణ్ రెడ్డి నివాసం వద్ద ఎండకు నీటి కోసం అల్లాడుతున్న వానరం దాహాన్ని పోలీసు తీర్చాడు. మంత్రి నివాసం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ మహమ్మద్ అహ్మద్.. మంగళవారం వానరాన్ని చేతిలో తీసుకుని నీటిని అందించి మానవత్వం చాటాడు. శభాష్ పోలీసు అంటూ ప్రజలు అభినందించారు.